



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 214 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 9 ఏప్రిల్ 2026 | వెల : 1/-రూ ॥
VOLUME :9 ISSUE :214 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 9 APRIL 2026 | PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..
# ముగ్గురి మృతి

- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీదద వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిగతా 2లో




## విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

- ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు
- మూడు నెలల పాటు తగ్గింపులు అందించాలని సూచన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో నష్టాలు చవిచూసిన విమానయాన సంస్థలు

మిగతా 2లో

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- దోచుకో.. పంచుకో.. తినుకో సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న జగన్
- రెండేళ్లలో చంద్రబాబు రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపణ
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మడిపాటు
- వచ్చే సంవత్సరం పాదయాత్ర
- నా పాదయాత్రలో చంద్రబాబుకి రోజుకో సినిమా
- తాడేపల్లిగూడెం పార్టీ నేతల సమావేశంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి



**పెన్ పవర్ డెస్క్:** వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర మొదలవుతుందని, ఆ తరువాత చంద్రబాబుకు రోజుకో సినిమా చూపిస్తామని వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం పార్టీ నేతలతో వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి పాలనకు సగం టర్మ్ అయిపోయింది. మిగిలింది ఒక సగం టర్మ్ మాత్రమే. ఇంకో సంవత్సరం దాటితే, రేపటి సంవత్సరం వచ్చేసరికి నా పాదయాత్ర కూడా స్టార్ట్ అవుతుంది. దాని తర్వాత నేను కూడా రోడ్డుమీదకు వచ్చి ఒకటిన్నర సంవత్సరం ప్రజలతోనే నియోజకవర్గాల్లో తిరుగుతూ ఉంటాను. పాదయాత్ర స్టార్ట్ అయిన తర్వాత చంద్రబాబుకు ప్రతి రోజు సినిమా చూపిస్తాం.

మిగతా 2లో





## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం,
# ఆర్థిక ప్రగతి

- రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం
- పోర్టులను అనుసంధానిస్తూ ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు
- గోదావరి పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశం
- తక్కువ రవాణా వ్యయం కోసం ఈవీ బస్సుల వినియోగం పెంచాలని సూచన
- ప్రధాన నగరాలకు ఔటర్ కారిడార్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని నిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:** రాష్ట్రంలో కేవలం ప్రయాణ సౌకర్యాల కోసమే కాకుండా, విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన

మిగతా 2లో



# ‘మావిగన్’ నచ్చకపోతే ‘అయోధ్య’ అని పేరు పెట్టుకోండి

- మావిగన్ ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్
- వందేళ్లయినా అమరావతి పూర్తి కాదని వ్యాఖ్య
- అమరావతిలో రాధాకృష్ణ బ్యాచ్ ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని వ్యవహారం, ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్య లపై మాజీ మంత్రి, వైసీపీ పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. కృష్ణా జిల్లా ముస్తాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అటు రాజధాని అంశంపై,

మిగతా 2లో

## ‘మై టీడీపీ యాప్’ టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

- కష్టపడిన వారిని గుర్తించడమే పార్టీ సిద్ధాంతమని లోకేశ్ స్పష్టీకరణ
- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశం
- కార్యకర్తలను పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్న వైనం

మిగతా 2లో




## నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...
# పోలింగ్ కు సర్వం సిద్ధం



- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

మిగతా 2లో

## ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...
# గవర్నర్ జోక్యం చేసుకోవాలి



- ప్రభుత్వ అప్పులపై ఆర్థిక శాఖ తప్పుడు లెక్కలు చూపిందని గవర్నర్‌కు బొత్స ఫిర్యాదు
- 2024-25లో రూ. 20,500 కోట్లకు పైగా అప్పులు తక్కువగా చూపారని ఆరోపణ
- ఆఫ్-బడ్జెట్ రుణాలు, పబ్లిక్ అకౌంట్ నిధులను దాచిపెట్టారని విమర్శ
- తప్పుడు సమాచారాన్ని ఉపసంహరించుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మిగతా 2లో

## నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్...
# సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

- మంగళగిరిలో 87వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి లోకేశ్
- విజయవాడ లోకో పైలట్ల గ్యాలా డిపో తరలించవద్దని సిబ్బంది వినతి
- కొవిడ్ నష్టాల నేపథ్యంలో ఆదుకోవాలని కోరిన హైర్ బస్సుల యజమానులు
- తమ భూమి కబ్జాకు గురైందని న్యాయం చేయాలని కోరిన కర్నూలు మహిళ
- వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేశ్ హామీ

మిగతా 2లో



## లెబనాన్‌పై ఇజ్రాయెల్
# భీకర దాడులు..

## ఒప్పందం నుంచి వైదొలగుతామన్న ఇరాన్... హర్మ్యూజ్ మళ్లీ మూసివేత

- మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి గండి
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో మళ్లీ రాజుకున్న వివాదం
- కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధించిన ఇరాన్
- ఒప్పందం నుంచి వైదొలుగుతామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌కు హెచ్చరిక
- చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:** మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం అమెరికా చొరవతో కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడమే దీనికి కారణమైంది. ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇరాన్, ఒప్పందం నుంచి వైదొలుగుతామని



మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...

# పోలింగ్ కు సర్వం సిద్ధం

దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 2016-2021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి.

రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 18-19 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్‌ఆర్‌సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు.

2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్‌ఆర్‌సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2016-2021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

### ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

# గవర్నర్ జోక్యం చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ తప్పుడు, అసంపూర్ణ సమాచారాన్ని శాసనమండలికి సమర్పించిందని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఫిబ్రవరిలో జరిగిన మండలి సమావేశాల్లో ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో వాస్తవ అప్పుల వివరాలు పూర్తిగా లేవని, గణాంకాలను తక్కువ చేసి చూపారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ కాపీని వైసీపీ మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు రూ. 60,485 కోట్లుగా పేర్కొన్నారని, అయితే కాగ్ (జూా+) ఆడిట్ ప్రకారం వాస్తవ నికర అప్పులు రూ. 81,082 కోట్లుగా ఉన్నాయని బొత్స వివరించారు. ఈ రెండింటి మధ్య రూ. 20,500 కోట్లకు పైగా తేడా ఉందని, దీనికి సరైన కారణాలు కనిపించడం లేదని తెలిపారు. ఆర్‌బీఐ నుంచి తీసుకున్న 'వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు', పబ్లిక్ అకౌంట్ కింద ఉన్న డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్స్ వంటి ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం తన లెక్కల్లో కలపలేదని ఆయన ఆరోపించారు.

అంతేకాకుండా, 2025-26లో ఆఫ్-బడ్జెట్ రుణాలు ఏవీ లేవని ప్రభుత్వం చెప్పడం కూడా సరికాదన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు సమీకరించారని, ఇవి కూడా ప్రభుత్వ అప్పుల కిందకే వస్తాయని గుర్తుచేశారు. శాసనసభకు తప్పుడు సమాచారం ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బొత్స అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని, తప్పుడు సమాధానాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, ఈ తేడాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత చాలా అవసరమని బొత్స తన లేఖలో స్పష్టం చేశారు.

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- మొదటి పేజి తరువాయి

**చంద్రబాబు చర్యలతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారు**

అన్నింటికన్నా ఆశ్చర్యం కలిగించే విషయం మావిగన్. నిజంగా చంద్రబాబుకు మోస్ట్ ప్రాక్టికల్ సొల్యూషన్ ఇచ్చాం. మనం చాలా లౌక్యంగా అయ్యా చంద్రబాబు గారు మీరు చేస్తున్న చర్యలతో రాష్ట్రానికి ఎప్పటికీ క్యాపిటల్ లేకుండా చేస్తున్నారు. అలా చేయడం వల్ల రాష్ట్రానికి మీ తీరుతో క్యాపిటల్ అనేది ఉండదు. ఇది మానుకోండి. అమరావతి అని మీరు రైతులను మోసం చేస్తున్నారు. అమరావతి అని ప్రజలను మోసం చేస్తున్నారు. ఆ అమరావతిలో రోడ్లు వేయడానికే, కరెంట్ ఇవ్వడానికి, డ్రైనేజీ వ్యవస్థ, నీళ్లు వంటి బేసిక్ వసతులు కల్పించడానికే నీ అంతట నువ్వే ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని సెంట్రల్ గవర్నమెంట్‌కు, బ్యాంకులకు డీపీఆర్‌లు ఇచ్చావు. ఈ లెక్కన 50 వేల ఎకరాలకే లక్ష కోట్లకు దిక్కులేదు అనుకుంటే... మరో 50 వేల ఎకరాలు అని చెప్పి మళ్లీ భూ సమీకరణ చేపడుతూ... లక్ష ఎకరాల అమరావతి అని చెబుతున్నావు. ఈ లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లతో నీవు నిరంతరం రోడ్లు వేయడం, కరెంట్ ఇవ్వడం, డ్రైనేజీ పనులు చేస్తూనే ఉంటావు. నిరంతరం నీళ్లు ఇచ్చేందుకే అవస్థలు పడుతుంటే ఇక రాజధాని ఎప్పుడు వస్తుంది? ఎన్ని దశాబ్దాలు పడుతుంది? ఇప్పటికే 12 ఏళ్లు అయిపోయింది. 2014 నుంచి ఇప్పటి వరకు ఏమీ లేదు. ఇంకా ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదు. డబ్బంతా రోడ్లకే, కరెంట్, నీళ్లకే ఖర్చు అవుతుంది. ఆ రెండు లక్షల కోట్ల విలువ దశాబ్దాలకు రూ.4 లక్షల కోట్లు అవుతుందో, ఇంకా ఎంత అవుతుందో తెలియదు. చివరికి 12 ఏళ్ల తర్వాత కూడా రాష్ట్రానికి రాజధాని లేదు. ఇంకా 20 ఏళ్ల తర్వాత కూడా అదే పరిస్థితి ఉంటుంది. అయ్యా చంద్రబాబు ఇది మానుకో. ఆ రెండు లక్షల కోట్లలో 10 శాతం ఖర్చు చేస్తే చాలు. ప్లాన్-ఏ వద్దన్నారు..ప్లాన్-బీపై ఎందుకు ఆలోచన చేయడం లేదు? నేను ఇంతకు ముందు రాజధాని విషయంలో మంచి ఆలోచన చెప్పాను. ప్లాన్--ఏ కింద రాష్ట్రంలో అన్నింటి కన్నా పెద్ద నగరం విశాఖపట్నం... అందులో కార్యనిర్వాహక రాజధాని పెడితే ఎలాంటి ఖర్చు అవసరం ఉండదు. శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం అప్పట్లో మనం కర్నూలుకు మాటిచ్చాం, అది నెరవేర్చుతూ అక్కడ న్యాయ రాజధాని పెడుతూ... ఇక్కడే అమరావతిలో శాసన రాజధాని తీసుకువస్తే బాగుంటుందయ్యా అని చెబితే నానాయాగీ చేసి, రాజకీయాలు చేసి అవి వద్దు అన్నారు. సరే పోనీ అది వద్దు. కనీసం ఈ ప్రాంతంలోనైనా నీవు చేసే పనికి రాజధానినే లేకుండా పోతుందయ్యా. ఆ పని చేయకుండా కనీసం ఇక్కడైనా ఆలోచన చేయమని ప్లాన్--బీ కింద మావిగన్ ప్రతిపాదన తెచ్చాం.

**10 శాతం ఖర్చు చేస్తే ఇక్కడే బ్రహ్మాండమైన రాజధాని**

మచిలీపట్నంలో పోర్టు కట్టింది నీవు కాదు చంద్రబాబు, మేం కట్టాం. వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పోర్టుకు భూసేకరణ చేపట్టాం. మన హయాంలోనే అనుమతులు తీసుకువచ్చాం. మన హయాంలోనే ఫైనాన్షియల్ క్లోజర్ చేశాం. అప్పట్లోనే బ్యాంకులతో నీట్‌గా టైఅప్ చేసి వర్క్ 30--40 శాతం కూడా పూర్తి చేశాం. ఆ పోర్టు పూర్తవుతుంది. మచిలీపట్నం నుంచి విజయవాడకు 70 కిలోమీటర్లు, విజయవాడ నుంచి గుంటూరుకు 40 కిలోమీటర్లు. మొత్తం ఈ 110 కిలోమీటర్లు హైవే ఉంది. విజయవాడలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంది. మచిలీపట్నంలో పోర్టు వస్తుంది. ఈ హైవేకు అటుఇటుగా అమరావతిలో కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కడితే బాగుంటుంది. మచిలీపట్నం నుంచి (మా), విజయవాడ నుంచి (వీ), గుంటూరు నుంచి (గన్) అంటూ మావిగన్ ప్రతిపాదన చేశాం. ఈ 110 కిలోమీటర్ల ఎకనామిక్ కారిడార్‌ను క్యాపిటల్ కారిడార్‌గా డిక్లేర్ చేసి, ఆ కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కట్టండి. రెండు లక్షల కోట్లలో 10 శాతం ఇక్కడ ఖర్చు చేసి రోడ్లకు కనెక్టివిటీ ఇస్తే చాలు, బ్రహ్మాండమైన రాజధాని ఇక్కడే తయారు అవుతుంది. డే వన్ నుంచే రాజధాని వస్తుంది. ఒక గ్రోత్ ఇంజన్ తయారవుతుంది. కనీసం 20 ఏళ్ల తర్వాత అయినా మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. మావిగన్‌లోనే ఉద్యోగాలు దొరుకుతాయి అని చిలుకకు చెప్పినట్లు చెప్పినా, చంద్రబాబు ఒప్పుకోవడం లేదు.

**జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు..**

మనమంతా బాగా, లౌక్యంగా చెప్పినా గానీ ఆహా అంటున్నాడు. ఎందుకు అహా... ఎందుకు వద్దు... కారణం అక్కడ రెండు లక్షల కోట్లలో మొబిలైజేషన్ వర్కుల పేరుతో 8 శాతం కమిషన్లు తీసుకోవచ్చు. మావిగన్‌లో ఈ ఆదాయాలు ఉండవు కదా. కాబట్టి మావిగన్ వద్దు. అమరావతిలో కాంట్రాక్టర్లు ఎవరు అంటే ఒకడు ఈనాడు రామోజీరావు వియ్యంకుడు రఘు (ఆర్‌జీవీ), ఇంకొకరు బీఎస్‌ఆర్ (బల్క్ శ్రీనివాసరావు). వీరు చంద్రబాబు బినామీలు. అమరావతి కాంట్రాక్టర్లు అంతా వీళ్లే. దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం. అందుకనే మావిగన్ అంటే ఆహా... వైయస్ జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు.

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

- మొదటి పేజి తరువాయి

కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం రహదారులు-భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్వహణ, గుంతలు లేని రోడ్లు, ఈవీ బస్సుల వినియోగం, పోర్టు కారిడార్ల అభివృద్ధి వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**వివిధ నగరాలకు ఔటర్ కారిడార్లు**

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

**రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి**

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్టంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

**గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ**

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కీ' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**పోర్టుల అనుసంధానమే లక్ష్యం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

**ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం**

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు.

ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-దోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు**

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..

హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది.

ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు.కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు..

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించింది. అంతేకాకుండా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాల పాటు యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలను సురక్షితంగా కొనసాగించడం ప్రధాన షరతు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని, అక్కడి హెజ్బొల్లా బలగాలపై తమ సైనిక చర్యలు యథావిధిగా కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అన్నట్లుగానే, లెబనాన్‌పై, ముఖ్యంగా రాజధాని బీరట్‌లోని నివాస, వాణిజ్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ పౌరులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఇజ్రాయెల్ చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. దాడులు ఇలాగే కొనసాగితే తాము ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, తమ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే ఏ నౌకనైనా ధ్వంసం చేస్తామని ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. ఇటీవల ఇరాన్ ఈ జలసంధిని నిరోధించినప్పుడు అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. తాజా పరిణామం మళ్లీ అదే ఆందోళనకు దారితీస్తోంది.వాస్తవానికి పాకిస్థాన్‌లో శాశ్వత శాంతి చర్చలు జరపాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ם

అయితే, హర్మూజ్ జలసంధిపై పూర్తి సైనిక ఆధిపత్యం తమకే ఉండాలని, దాని ద్వారా ప్రయాణించే నౌకల నుంచి రుసుము వసూలు చేసే హక్కు కల్పించాలని ఇరాన్ కొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది. కానీ అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరస్పర విరుద్ధ వైఖరులతో మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. హర్మూజ్ జలసంధి భద్రతపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

కష్టపడి పనిచేసే వారిని గుర్తించడమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, 'మై టీడీపీ యాప్'ను సమర్థవంతంగా వినియోగిస్తున్న టాప్ 10 పెర్ఫార్మర్స్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ ఆత్మీయ భేటీ జరిగింది.ఈ సందర్భంగా లోకేశ్... పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వారి కుటుంబ నేపథ్యం, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ, సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్న కార్యకర్తల సేవలను ఆయన అభినందించారు.పార్టీకి కార్యకర్తలే బలమని, వారి శ్రమను ఎన్నటికీ విస్మరించబోమని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఇలాగే పనిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు మంత్రి లోకేశ్ తో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్... సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గ్యాలా డిపోను తరలించవద్దని సిబ్బంది మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకునేందుకు రీప్లేస్‌మెంట్ వాహనాలను ఇప్పించాలని హైర్ బస్సుల యజమానులు కోరారు.కర్నూలు జిల్లా, గూడెంపాడుకు చెందిన ఎస్. చిన్న శివమ్మ అనే మహిళ తన వారసత్వ ఆస్తి అయిన 2.63 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని మంత్రిని అభ్యర్థించారు. ప్రజలు సమర్పించిన వినతులను సావధానంగా విన్న లోకేశ్, వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 'మావిగన్' నచ్చకపోతే 'అయోధ్య' అని పేరు పెట్టుకోండి

- మొదటి పేజి తరువాయి

ఇటు మీడియా సంస్థల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్ విసిరారు. వందేళ్లయినా పూర్తికాని అమరావతి పేరుతో కేవలం దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రం అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కొత్త ప్రతిపాదన తెచ్చారని సమర్థించారు. "ఒకవేళ మావిగన్ నచ్చకపోతే ఆ ప్రాంతానికి అయోధ్య అని పేరు పెట్టుకోండి, కానీ దోపిడీ మాత్రం ఆపండి" అని అన్నారు. ఆడవాళ్లను కించపరిచేలా మాట్లాడినందుకు రాధాకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. కాశీకి వెళ్లి సిగ్గుశరం వదిలేసి వచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో దాదాపు 4 లక్షల కోట్లు అప్పు చేస్తే ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. వాలంటీర్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎందుకు బయటపెట్టడం లేదని అడిగారు. కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అమరావతిలో రాధాకృష్ణ 'బ్యాచ్' ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విమానయాన సంస్థలకు మూడు నెలల పాటు ఈ తగ్గింపులు అందించాలని సూచించింది. ఇరాన్, అమెరికా యుద్ధం నేపథ్యంలో, దేశీయ విమాయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా సంస్థలు భారీ నష్టాలు చవిచూశాయి.దీనితో, విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని ఛార్జీలను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని కేంద్రాన్ని కోరాయి. ఈ క్రమంలో కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనమిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

# వై ఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన మురళీకృష్ణంరాజు.

కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 8 08: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త వడ్డె రఘురాం ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొని వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాల చర్చించారు.



# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## మహిళల ఆత్మనిర్భరతకు ప్రోత్సాహం ఎమ్మెల్యే వనమాడి





**కాకినాడ, పెన్ పవర్, ఏప్రిల్ 8:**కాకినాడ నగరంలో స్థానిక మహిళల ఆత్మనిర్భరతకు ప్రోత్సాహం కల్పించే దిశగా "రీచ్ మై స్టోర్" ప్రారంభమైంది. నగరంలోని కరణం గారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బుధవారం సిటీ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ప్రారంభించారు.నగర పాలక సంస్థ పరిధిలో మెప్మా మరియు "రీచ్ మై స్టోర్" సంస్థల సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ, మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తులు మార్కెట్‌కు చేరేందుకు ఇలాంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ స్టోర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో పాటు పిల్లల ఆట వస్తువులు, గృహ వినియోగ వస్తువులు, బహుమతి వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ శైలజ, సిటీ మిషన్ మేనేజర్ డి. వెంకట్రాజు, టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, "రీచ్ మై స్టోర్" ప్రతినిధి సాయి కృష్ణ, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వినియోగ దారులకు ఉచిత సోలార్

## కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభం






**పిఠాపురం, పెన్ పవర్,ఏప్రిల్ 08 :**పిఠాపురం నియోజకవర్గం జల్లూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన" కింద ఎస్సీ,ఎస్టీ వినియోగ దారులకు ఉచిత సోలార్ విద్యుత్ పథకం బుధవారం ఘనంగా ప్రారంభమైంది.కాకినాడ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.లబ్ధిదారురాలు కొరమారి నాగమణి గృహంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జల్లూరు ఎస్సీ కాలనీలోని డా. బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని తెలిపారు. నెలకు 200 యూనిట్లకు తగ్గ విద్యుత్ వినియోగం ఉన్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రతినెల రూ.200 వరకు ప్రోత్సాహకం బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు.జిల్లాలో సుమారు 19 వేల మంది అర్హులుండగా ఇప్పటివరకు 16 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రూ.73.56 కోట్ల వ్యయంతో 12.94 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రతి గృహానికి సగటున 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌ను ఉచితంగా అమర్చుతున్నట్లు చెప్పారు. పిఠాపురం మండలం జల్లూరు గ్రామంలో 72 మంది లబ్ధిదారుల గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ఎస్సీ,ఎస్టీ వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఈ పథకం పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ కార్యక్రమం ప్రారంభమవడం ఆనంద దాయకమన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మర్యాద పూర్వకంగా కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యేలు





కాకినాడ, పెన్ పవర్, ఏప్రిల్ 8: అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## విద్యుత్ ను పొదుపు చేయాలి



- నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవారు అర్హులు
- సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు
- ఎమ్మెల్యే వేగుళ్ళ

మిగతా 6లో...




# అభివృద్ధి-సంక్షేమ సంతులనంతో రాష్ట్ర బడ్జెట్

## మంత్రి పొంగూరు నారాయణ







**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 8:**ఆర్థిక లోటు,అవరోధాలను అధిగమిస్తూ అభివృద్ధి మరియు సంక్షేమాల సంతులనంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే లక్ష్యంతో 2026--27 సంవత్సర బడ్జెట్ రూపొందించి నట్లు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించిన బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వరుపుల సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బడ్జెట్ ముఖ్యాంశాలను విశ్లేషణాత్మకంగా వివరించారు.మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర విభజనతో ఆర్థిక వనరులు తగ్గిపోవడంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మారిందన్నారు. గత ప్రభుత్వ అప్పుల భారం మధ్య కూడా అభివృద్ధి, సంక్షేమానికి లోటు లేకుండా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.సూపర్ సిక్స్ పథకాల కింద పింఛన్ల పెంపు, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం,
దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రో-ఇండస్ట్రీ విధానాలతో 9.68 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి లక్షలాది ఉద్యోగాలు సృష్టించినట్లు వెల్లడించారు.గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా భారీ పెట్టుబడులు రానున్నాయని, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధికి కీలక మవుతుందని తెలిపారు. అమరావతిని రాష్ట్ర శాశ్వత రాజధానిగా ప్రకటించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించండి







**ఆలమూరు.పెన్ పవర్, ఏప్రిల్ 08;** గ్రామ వీధులు పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో ఏ రాజు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజాపరిషత్ సమావేశపు మందిరంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖలకు సంబంధించి వారు నిర్వహించే పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలో 18 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు గృహ నిర్మాణాలకు లబ్ధిదారుల నుండి వచ్చిన దరఖాస్తుల్లో 1004 ఆన్లైన్ ప్రక్రియ పూర్తయింది అన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి రూ. 2 లక్షల 39 వేలు అందించనున్నట్లు హౌసింగ్ ఏఈ తెలిపారు. అలాగే రక్షిత మంచినీటి కుళాయి పైపులకు ఎవరైనా మోటర్లు బిగించిన ఎడల వారిపై చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో హెచ్చరించారు. అలాగే శివారు పంట పొలాలకు సాగునీరు అందాలంటే పంట కాలవలో రైతులు ఏర్పాటుచేసిన అనధికార తూరలను తొలగించాలని కొందరు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జన గణనకు వచ్చే అధికారులకు ప్రజలు తమ సమాచారాన్ని అందించి సహకరించాలని తాసిల్దార్ ప్రకాష్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సర్పంచ్ల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన రావడంతో గ్రామాల్లో గల వీధులు అన్ని పరిశుభ్రంగా ఉంచి వీధిలైట్ల, రక్షిత మంచినీటి నిర్వహణ వంటి వాటిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది తమ ఎలక్ట్రికల్ లైనలకు వృక్షాలు అడ్డు వస్తున్నాయంటూ ఇష్టానుసారంగా పంచాయతీలకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కొమ్మలను నరికివేస్తూ మురుగు కాలువలు, రోడ్లపై పారేస్తున్నారని ఇలా చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు సభ్యులు సభ దిష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఫైలేరియా నియంత్రణకు ముందడుగు: ఆత్రేయపురంలో కిట్ల పంపిణీ






**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8** ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు బుధవారం ఎం ఎం డి కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ చిటికెన వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి. సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి. అరుణకుమారి పాల్గొన్నారు. అలాగే వైద్య సహాయకులు ఎం.టి.వి.ఎన్. మూర్తి, ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్లు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఫైలేరియా బాధితులకు అవసరమైన ఔషధాలు, సంరక్షణ పరికరాలతో కూడిన ఎం ఎం డి కిట్లు అందజేయడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు.

# ఘనంగా డాక్టర్ ప్రణీత్ జన్మదిన వేడుకలు

### పేషంట్లకు బిరియాని పంపిణి



**గండేపల్లి,పెన్ పవర్, ఏప్రిల్ ,8:** గండేపల్లి మండలం జెడ్ రాగంపేట పరిధిలోని 16 నెంబర్ జాతీయ రహదారి వద్ద ఉన్న కమిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రణీత్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కమిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది మరియు రోగుల సమక్షంలో తలంగా వేడుకలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రోగులకు, మరియు సిబ్బందికి బిర్యానీ పంపిణీ పంపిణీ చేశారు. ఇంకా రోగులకు స్వయంగా డాక్టర్ ప్రణీత్ స్వయంగా తానే రోగులకు బిర్యానీ వడ్డించి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు.

## తూర్పులంక, రెల్లుగడ్డ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలు




**అల్లవరం,పెన్ పవర్,ఏప్రిల్ 08**తూర్పులంక రెల్లుగడ్డ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల విద్యాశాఖ అధికారి ఏడుకొండలు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయనకు సచివాలయ సిబ్బంది దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఏడుకొండలు మాట్లాడుతూ వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా క్రమం తప్పకుండా మంచినీటి సరఫరా చేయాలని వాటర్ ట్యాంకర్ క్లీనింగ్ శానిటేషన్ పారిశుద్ధ కార్యక్రమాలు మొదలైనవి సక్రమంగా జరిగేలా చూసుకోవాలని సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాయి కళ్యాణ్ వీఆర్వో వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు నకుల రాజు, ముత్యాల నరసింహారావు,మహిపాల శ్రీనివాస్ రావు,సిఆర్ఎంటి శెట్టి సచివాలయ సిబ్బంది ప్రత్యేక అధికారి ఏడుకొండలకు శుభాకాంక్షలు తెలియజేశారు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8** ఆత్రేయపురంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు బుధవారం నిర్వహించారు. ప్రముఖంగా పూతరేకులు తయారీ కేంద్రాలు హోటళ్లలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.తనిఖీల అనంతరం పూతరేకులు తయారీదారులు హోటల్ వ్యాపారస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించడం, నాణ్యమైన ముడి సరుకులను వినియోగించడం, ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.ప్రత్యేకంగా నెయ్యి, నూనెల వినియోగంలో నాణ్యతపై శ్రద్ధ వహించాలని తెలిపారు. దీనికి స్పందించిన వ్యాపారస్తులు తాము బ్రాండెడ్ నెయ్యినే వినియోగిస్తున్నామని తెలిపారు.ఆహార భద్రతపై రాజీ లేకుండా, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యత అందరిదని అధికారులు స్పష్టం చేశారు.

# స్వర్ణకుమారి మృతి పై కేసు నమోదు

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్,8**
గండేపల్లి మండలం ఎల్లమెల్లి గ్రామానికి చెందిన జుత్తుక స్వర్ణకుమారి వయస్సు 19 సంవత్సరాలు అను ఆమెకు రెండు సంవత్సరాల క్రితం రంగంపేట మండలం ముకుందవరం గ్రామానికి చెందిన మందనక్క ప్రసాద్ కుమార్ తో ప్రేమ వివాహం జరిగినట్లు, అప్పటినుండి మృతురాలు భర్త ఆమె అత్తగారు ఆమె చిన్న మామగారు కలిసి ఆమెను ఇబ్బందులకు గురి చేస్తున్నందున దివి ఈనెల 7 తేదీన మృతురాలి తల్లి ఇంటిలోనే సీలింగ్ ఫ్యాన్ కు చున్ని తో ఉరివేసుకొని చనిపోయినట్లు ఆమె
తండ్రి జుత్తుక నూకరాజు ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నట్లు ఎస్సై శివ నాగబాబు ప్రకటన ద్వారా తెలిపారు. , గండేపల్లి తాసిల్దారు శ్రీనివాస్ శవ పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.


# జల్లూరు అంగన్వాడీ కేంద్రం పరిశీలించిన కలెక్టర్





**పిఠాపురం, పెన్ పవర్,ఏప్రిల్ 08:** పిఠాపురం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జల్లూరులోని అంగన్వాడీ కేంద్రం, కుమారపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు.
పర్యటనలో భాగంగా జల్లూరులో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, చిన్నారులతో ముచ్చటించి వారు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకుల నాణ్యత, వివరాలు తెలుసుకున్నారు.చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు.అనంతరం కుమారపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, తాగునీటి వంటి అంశాలపై సమాచారం సేకరించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# బీసీల అభ్యున్నతికి, హక్కుల సాధనకు బీసీవై పార్టీ కట్టుబడి ఉంది.




**ఏలేశ్వరం , పెన్ పవర్, ఏప్రిల్ 8:** బీసీల అభ్యున్నతికి, హక్కుల సాధనకు భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) కట్టుబడి ఉందని ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఈనెల 11వ తేదీన బీసీల హక్కుల సాధనకు నిర్వహించబోయే ఆమరణ దీక్షకు మద్దతుగా గొంప శివకుమార్ యాదవ్ ఏలేశ్వరం కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. దీక్షా శిబిరంలో శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ బీసీ సింహగర్జన సభలో కూటమి ప్రభుత్వానికి ఐదు డిమాండ్లను డిమాండ్ చేసిన సందర్భంగా వాటిని నెరవేర్చకపోతే ఈ నెల 11న ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చెప్పడం జరిగింది.ఆ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా, బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్ష ప్రారంభించాం అన్నారు. బీసీలే వెన్నుముక, బీసీలు లేకపోతే తెలుగుదేశం పార్టీ లేదు అని, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలంతా బీసీ వర్గానికి చెందిన వారేనని ఎప్పుడు ప్రగల్భాలు పలికే కూటమి ప్రభుత్వం, బీసీల అభ్యున్నతి కొరకు , బీసీల రక్షణ కొరకు, బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ చేసిన డిమాండ్ చేసిన ఐదు డిమాండ్లను నెరవేర్చకపోగా కనీసం స్పందన కూడా తెలియజేయలేదని, ఇదేనా వారికి బీసీలపై ఉన్న ప్రేమ అని ప్రశ్నించారు ? కూటమి ప్రభుత్వం బీసీల పట్ల ఇదే విధానం కొనసాగిస్తే బీసీల యొక్క ఆగ్రహానికి కచ్చితంగా గురవుతారని బీసీలు తలచుకుంటే ప్రభుత్వాలు కుప్ప కూలిపోతాయనీ ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో, గొంప శివ కుమార్ తో పాటు సి. రాయవరం మాజీ సర్పంచ్ దేవర శ్రీను, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఏగుపాటి అర్జున్ రావు, సానబోయిన ఆది బాబు, పల్ల గంగ బాబు, బొడ్డు అనిల్ కుమార్, గొంప శివ, శరణం హరీష్, వమ్మి సురేంద్ర, మానబాల నాని, కోర్ని ప్రసాద్, పి అప్పయ్యమ్మ, ఎం చిలకమ్మ, కె దయామణి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి ఎంపీడీవో బి కె ఎస్ ఎస్ వెంకట రామన్





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు.సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ప్రత్యేకంగా అర్హులైన ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. పనుల నాణ్యతను కాపాడుతూ వేగవంతంగా పూర్తి చేయడం, కార్మికులకు సమయానికి వేతనాలు అందేలా చూడడం పై దృష్టి సారించాలని సూచించారు.
అలాగే పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో చురుకుగా పనిచేసి, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎపిఒ సి.హెచ్. విజయ రెడ్డి, సాంకేతిక సహాయకులు మండలంలోని అన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. సమావేశం ద్వారా పథకం అమలులో మరింత చురుకుదనం తీసుకురావాలని అధికారులు సంకల్పించారు.

## ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న విజయవాడ కనకదుర్గ దేవస్థానం చైర్మన్ బొర్రా రాధకృష్ణ




**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8** కోనసీమ తిరుమలగా భక్తుల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తి వాతావరణం నెలకొంది. విజయవాడ కనకదుర్గ దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఆయనను అర్చకులు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, సేవలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కలసి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్నారు.భక్తుల విశ్వాసానికి కేంద్రంగా నిలిచిన ఈ ఆలయం ప్రాంతీయంగా "కోనసీమ తిరుమల"గా ప్రసిద్ధి చెందింది. ఏడువారాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ద్వారా కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు.దర్శనానంతరం ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు బొర్రా రాధాకృష్ణ దంపతులను దుస్సాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

# బొల్లం రెడ్డి రామకృష్ణను అభినందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి, పెన్ పవర్ ఏప్రిల్ 8:** టిడిపి కార్యాలయంలో జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడ మంగళగిరి ఆఫీసులో మన టిడిపి యాప్ ద్వారా రాష్ట్రంలోనే అత్యంత ప్రతిభ కనబరిచిన బొల్లం రెడ్డి రామకృష్ణను రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన 19 మంది ఎంపిక కావటం, అందులో మన టిడిపి యాప్ ను సమర్థవంతంగా ఉన్నత స్థాయిలో ప్రమోట్ చేసినందుకు గాను చాలా అరుదైన పురస్కారం బొల్లం రెడ్డి రామకృష్ణకు లభించింది, జీవిత సాఫల్య బహుమతి గా అంటే లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, రాష్ట్రమంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకోవడంతో బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బొల్లం రెడ్డి రామకృష్ణ అభినందించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**జగ్గంపేట ఎస్సై రఘునాధరావు**



**జగ్గంపేట, ఏప్రిల్ 8 :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే చర్యలు తప్పవని జగ్గంపేట ఎస్సై టి. రఘునాథరావు హెచ్చరించారు. బుధవారం జగ్గంపేట నుంచి గోకవరం వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహన దారులను ఆపి హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోతాయని వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చునే వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతపై తెలియజేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులు లైసెన్సు, ఆర్ సి, ఇన్సూరెన్స్ అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేయాలని ఎస్సై రఘునాధరావు వాహనదారులకు సూచించారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇండియన్ ఫ్లాప్ సెల్ తాబేళ్లు స్వాధీనం



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 08;** అక్రమంగా తరలిస్తున్న ఇండియా ఫ్లాప్ సెల్ రకం తాబేళ్లను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ఇచ్చిన సమాచారం మేరకు ఒడిస్సాకు చెందిన కొందరు మంగళవారం రాత్రి 10.30లకు ద్వారపూడి, మండపేట, ఆలమూరు మీదుగా వాహనంలో తాబేళ్లను రవాణా చేస్తున్నారని తెల్సుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాజా ఆధ్వర్యంలో డిఎస్ఎన్ మూర్తి తదితర సిబ్బందితో కల్సి వారిని వెంబడించారు. అయితే నిందితులు చొప్పెల్ల సమీపంలో వాహనాన్ని ఆపి కాలువలోకి దూకేసి తప్పించుకున్నారు. ఆలమూరు పోలీస్టేషన్లో ఈ అంశంపై ఫిర్యాదుచేసి వాహనాన్ని రావులపాలెం ఫారెస్ట్ ఆఫీసుకు తరలించారు. బుధవారం ఉదయం జిల్లా అటవీశాఖ అధికారి ఎమ్ వివి ప్రసాదరావు ఆధ్వర్యంలో వాటిని పరిశీలించి వెటర్నరీ, రెవెన్యూ అధికారులతో సమక్షంలో పంచనామా చేసి ఇండియన్ ఫ్లాపెల్ తాబేళ్లుగా తేల్చి వాటిని పంటకాలువలోకి సురక్షితంగా వదలడం జరిగిందని రాంబాబు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం పై అధికారులకు విన్నవించామన్నారు.

## జగ్గంపేటలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 8:** స్థానిక కాకినాడ రోడ్ లోని సాయిబాబా గుడి ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి ముఖ్యఅతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మానేపల్లి బంగారాజు, జోన్ చైర్ పర్సన్ మానేపల్లి రామానుజ, వాసవి క్లబ్ సెక్రటరీ నిట్టాల శ్రీనివాస్, బీటెక్ యూత్ ప్రెసిడెంట్ ఉద్దగిరి కామేష్, ముమ్మిడివరపు లలిత్ బాబు, తాతబాబు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంటూ సిపిఐ (ఎంఎల్) నిరసన






ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 8: ప్రజా సమస్యల పరిష్కరించండి అంటూ సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధి జె. అన్నవరం గ్రామంలో వలస భూస్వామి యార్లగడ్డ సత్యనారాయణ చౌదరి ఆక్రమణలో ఉన్న సర్వే నెంబర్. 242–243–244–225 లలో ప్రభుత్వ సీలింగు అసైన్మెంట్ అయింది. 26 ఎకరాలు సుమారుగా ఉండగా ఒక సంస్థపేరు పెట్టి ప్రత్తిపాడు సభ రిజిస్ట్రీ ఆఫీసు నందు భార్య కుమారుల పేర్లు తో ఈ రిజిస్ట్రేషన్ చేయించుకుని అమ్మకానికి సిద్ధం చేశారు. అదనంగా మరొక ఎకరం కూడా చౌదరి ఆక్రమణ లో ఉంది. ఈ విషయమై
రెండు సంవత్సరాల నుండి మండల్ తాసిల్దార్ వాయిదాలు వేస్తా ఉన్నారు. అలాగే జె. అన్నవరం లో మాజేటి వలస భూస్వామి కుటుంబీకులు ఆక్రమణ లోసర్వే నెంబర్246/1--246/2..-256 లలో మొత్తం 909. సెంట్లు. తన సొంత భూమిలో కలుపు కొని ప్రతిపాడు సభ రిజిస్టర్ ఆఫీస్ లో వాళ్ల కుటుంబ సభ్యులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు ఈ విషయం అనేకసార్లు తాసిల్దారు వారికి చెప్పడం జరిగింది వాయిదాలు వేయడం కాలయాపన చేయడం జరుగుతున్నద్ది. అలాగే రమణయ్యపేట ఏలేశ్వరం మధ్యలో ఏలేరు స్టీల్ ప్లాంట్ కాలవ బ్రిడ్జి వద్ద రక్షణ గోడ లేక మన్యం ప్రతిరోజు వెళ్లే ప్రధాన రహదారి వాహనాలలో ప్రయాణించేవారు ప్రమాద వసాత్తు కాలువలో పడి మరణిస్తా ఉన్నారు. ఏలేరు ముంపు ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవటం లేదు. ఏలేశ్వరం నగర పంచాయతీ లో ఏలేరు ప్రాజెక్టు ముంపు బాధిత నివసిస్తున్న వారు ఇండ్ల స్థలాల కొరకు వై ఆర్ సి మిగులు భూమి సర్వేనెంబర్79/3,79/4–80/1 లో. మొత్తం 919 సెంట్లు భూమిపై. ఏపీ హైకోర్టు డబ్ల్యూ నెంబర్2994 80 ఆఫ్ 2017 లో ఇండ్ల స్థలాలు ఇవ్వమని
డైరెక్షన్ ఇవ్వడం. అప్పట్లో జగన్ కాలనీ రావడంతో అందులో 40 మందికి ఇవ్వడం జరిగింది. మిగతా వారి లిస్టు గ్రామంలో లేరని చెప్పడం జరిగింది. దీనిని రియాక్వైరీ చేయమని జిల్లా కలెక్టర్ , ఆర్డీవో చెప్పినప్పటికీ తాసిల్దార్ పట్టించుకోలేదు. కావున పైన తెలిపిన సమస్యలపై తక్షణం స్పందించి త్వరితగతిన న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టి తాసిల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గండేటి నాగమణి,సహాయ కార్యదర్శి కందుల ప్రసాద్,గిరిజన సంఘం నాయకులు నాగులపల్లి అర్జునుడు, సోమల కుసల,కందుల క్రాంతి కుమార్, వల్లి కొండలరావు,మసిరపు రాజారావు, ఎద్దు బుజ్జమ్మ, పాకా లోవ బాబు, నాగులపల్లి సంకురు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదిరెడ్డి వెంకన్న దొర జ్ఞాపకార్థం.... ఏలేశ్వరం స్మశాన వాటికకు ఫ్రీజర్ వితరణ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** బదిరెడ్డి వెంకన్న దొర జ్ఞాపకార్థం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ కుటుంబ సభ్యులు పట్టణ స్మశాన వాటిక కు ఫీజర్ను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు విచ్చేసి ఫీజర్ వితరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబు కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సమాజ సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటారని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా బదిరెడ్డి గోవింద్ బాబు మాట్లాడుతూ ఏలేశ్వరం మండలంలో పేద ప్రజలకు ఫ్రీజర్ సదుపాయం లేకపోవడం వల్ల అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించి,వారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని తమ సొంత నిధులతో ఫ్రీజర్ తయారు చేయించడం జరిగిందని తెలిపారు. అలాగే ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ భవనం నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కైలాస ధామ నిర్వాహకుడు మాట్లాడుతూ ఫ్రీజర్ అందుబాటులో లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ఫ్రీజర్ తీసుకుని రావడానికి చాలా ఇబ్బంది పడే వారిని,వారు కష్టాలను గుర్తించి ఫ్రీజర్ బహూరించిన గోవింద్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల అబ్బు, బదిరెడ్డి వెంకన్నబాబు, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, సఖి రెడ్డి బుజ్జి, రాచర్ల రమేష్,జువ్విన వీర్రాజు,సామంతుల సూర్యకుమార్,కోరాడ ప్రసాద్,శేఖర్, ప్రగళ్లపాటి కామేష్, వేధిక సురేష్, పిరాట్ల సాయి విసు, దేగల చంద్రమౌళి, దేగల రమణ, భీశెట్టి రాజా,దత్తి రాజా, ఆకుల గంగరాజు, మధు,సిరిపురపు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## అకడమిక్ ఆడిట్ లో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 8:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో అకడమిక్ ఆడిట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ నియమించిన డాక్టర్ జి.పి. చక్రవర్తి, పి.ఆర్. ప్రభుత్వ కళాశాల కాకినాడ బయో–టెక్నాలజి ఆధ్యాపకులు మరియు డాక్టర్ వి.నారాయణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెరుమాళ్ళపురం, కెమిస్ట్రీ ఆధ్యాపకులు అకడమిక్ అడ్వైసెర్స్ గా హాజరై అద్యాపకులందరికి మార్గనిర్దేశికత్వం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళాశాల ప్రత్యేకతలు బోధనకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అకడమిక్ అడ్వైసెర్స్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమమంలో చక్రవర్తి కళాశాల నాక్ అక్రిడేషన్ కొరకు సంసిద్ధం కావడానికి సలహాలను అంధించగా నారాయణ రావు నాక్ అక్రిడేషన్ లో పాటించవలసిన మెళకువలను తెలియ చేశారు. కళాశాలలోని అన్ని డిపార్ట్ మెంట్లలో రికార్డులను పరిశీలించిన అకడమిక్ అడ్వైసెర్స్ సంతృప్తిని వెలిబుచ్చి, కళాశాలకు ఎ గ్రేడ్ ను అందించారు. తదుపరి కళాశాల మరింత మెరుగ్గా పనిచేయడానికి ఆధ్యాపకులకు తగు సూచనలు సలహాలు అందించారు.

## మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

**ప్రజల దాహార్తిని తీర్చిన అరుంధతీయ యూత్**



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 08;** మండల కేంద్రమైన ఆలమూరులో బుధవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు జరిగింది. గ్రామానికి చెందిన పెందుర్తి చినసత్యం (చిన్న) ప్రథమ వర్ధంతి సందర్భంగా అరుంధతీయ యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద అరుంధతీయ యూత్ ఈచలివేంద్రాన్ని నిర్వహించి వాహనదారులు, ప్రయాణీకులకు మజ్జిగను సరఫరా చేశారు. అనంతరం చినసత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వేమగిరి సతీష్, వేమగిరి అజయ్, ఉందుర్తి అజయ్, బి.క్రాంతి, వి.మున్నా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ ను కలిసిన అన్నవరం దేవస్థానం బోర్డు మెంబర్ నాగేంద్ర చౌదరి



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 8:** అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమితులైన పాలచర్ల నాగేంద్ర చౌదరి బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ తో అమరావతి వెళ్లి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను, ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అన్నవరం సత్యదేవుడి చిత్రపటాలను, భగవద్గీత, సత్యనారాయణ ప్రసాదం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ తనకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ప్రత్యేక చర్యలు.






–జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి. శ్రీధర్.

కిర్లంపూడి,పెన్ పవర్, ఏప్రియల్,08:రాష్ట్రవ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం మార్చి 16వ తేదీ నుండి ఏప్రిల్ 14 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగానిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వడ్డి శ్రీధర్ అన్నారు. బుధవారం తన పర్యటనలో భాగంగా జిల్లాలోని అన్ని పశు వైద్యశాలను పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు.ఇప్పటివరకు 60 శాతం గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం జరిగిందన్నారు.ఈనెల 14వ తేదీ వరకు 90% వ్యాక్సినేషన్ జరిగే అవకాశం ఉందని తెలిపారు.బుధవారం కిర్లంపూడి మండలం వీరవరం,భూపాలపట్నం, కిర్లంపూడి పశు వైద్యశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో సంచార వైద్య శాల వాహనం నడుస్తుందని పశువు కు ఎక్కడైనా గాయమైనప్పుడు వాహనం అక్కడికి వెళ్లి సిబ్బంది చికిత్స చేస్తారని తెలిపారు.జిల్లాలోని పశువైద్య సేవలకు మందులు కొరతలేదని యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని, మందులు కొరతలు ఉంటే ఎప్పటికప్పుడు కాకినాడ జిల్లా నుంచి పశు వైద్యశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కిర్లంపూడి పశువైద్యశాలకు ప్రహరీ గోడ ఎత్తు చేయడంతోపాటు గేటు ఏర్పాటు చేయవలసి ఉందని స్థానిక ప్రజా
ప్రతినిధుల సహకారంతో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో పశువులకు కాలి కుంటి వ్యాధి రాకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టెక్నికల్ వి ఏ ఎస్ డాక్టర్ గిరీష్, కిర్లంపూడి పశువైద్యాధికారి డాక్టర్ షేక్ జహంగీర్,తోపాటు వెన్నవినోద్, నహీం వెటర్నరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ను పొదుపు చేయాలి

- నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవారు అర్హులు
- సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు
- ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 8 : :** విద్యుత్ ను పొదుపు చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణం, 8వ వార్డులో ఎస్సీ, ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా సూర్యఘర్ పథకం అమలు చేస్తుందన్నారు. 8వ వార్డులో లబ్ధిదారుడు కందుకూరు తొక్కయ్య ఇంటి వద్ద ఈ సూర్యఘర్ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్యుత్ భారం తగ్గించి ప్రతి పేద ఇంటికి ఆర్థిక ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో ఈ సూర్యఘర్ పథకంను ప్రారంభించామన్నారు. ఈ పథకం ద్వారా సౌరశక్తి వినియోగం పెరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రతి ఇంటి మీద సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా స్వయం సమృద్ధి పట్టణంగా మండపేటను తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలన్నారు. అభివృద్ధే లక్ష్యం ప్రజల సంతోషమే బలమని పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ ఇ) బొల్లినేని రాజేశ్వరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్ పథకం కింద ఉచితంగా 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చుతారన్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవారు అర్హులని తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా, అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపడం ద్వారా ఆదాయం కూడా పొందవచ్చున్నారు. సొంత ఇల్లు ఉన్నవారికి 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్ ఉచితంగా అమర్చి 5 ఏళ్ల నిర్వహణ చేస్తారన్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం ఉండాలన్నారు. అదే ఇతరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీతో కలిపి 3 కిలోవాట్ల వరకు రూ. 78 వేలు వరకు రాయితీ లభిస్తుందన్నారు. నిరంతర విద్యుత్, సున్నా విద్యుత్ బిల్లు, అదనపు విద్యుత్‌ను విక్రయించే అవకాశం ఉందన్నారు. పి.ఎం.సూర్యఘర్ పోర్టల్ ద్వారా లేదా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అంగీకారం తెలపాలన్నారు. మండపేటలో సర్వే చేసిన ఎస్.సి, ఎస్.టి సర్వీసులు 7122 ఉన్నాయన్నారు. వీటిలో సోలార్ ఏర్పాటు కు అనుకూలంగా 3806 ఇళ్ళు ఉన్నాయని చెప్పారు. అనుగుణంగా లేనివి 3316 ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండపేట పట్టణా అధ్యక్షులు మత్స నాగబాబు, పెందుర్తి కిషోర్, పెందుర్తి ప్రదీప్ కుమార్, పల్లి వెంకటరావు, చాపల వీరబాబు, దూలి జయరాజు, మోరంపూడి సూరిబాబు, సవరపు సతీష్, పైడిమళ్ళ సతీష్, ముమ్మిడి వరపు నారాయణరావు, బొమ్మ గంగాధర్, దూలి ప్రవీణ్, కందుకూ రు గంగరాజు, మచ్చ రాంబాబు, గోసాల ప్రేమ్ కుమార్, సాధనాల చక్రపాణి, పిట్ట రాజబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూరి రమేష్ రాజు, పాలచర్ల శిరీష్, దూలి అన్నవరం, కనపర్తి సుబ్రహ్మ ణ్యం, రామచంద్రపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీర మల్లిక , మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ శ్రీధర్ , అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎం. ముని , జూనియర్ ఇంజనీ ర్ పి.వి. సత్యనారాయణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం మండలంలో...
# రబీ సీజన్ కు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** మండల పరిధిలో రబీ సీజన్ కు దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. పెద్దనాపల్లి , యర్రవరం, సి.రాయవరం గ్రామాల నందు రబీ 2025-26 సీజన్ కు గాను ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఏవి రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ బుజ్జి గారు మాట్లాడుతూ రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది అని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో ఎం ఏ ఓ మాట్లాడుతూ రైతులు ధాన్యం 17 % లోపల తేమ ఉండేలా ఆరబెట్టుకుని తమ గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందిని సంప్రదించడం ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం గోను సంచులను అందచేస్తుంది అని, జిపిఎస్ వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచడం జరిగింది అని తెలిపారు.
లి ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకొని కనీస మద్దతు ధరలు కామన్ రకం (75 కేజీ) - 1777/- ఎ గ్రేడ్ రకం (75 కేజీ)- 1792/- ను పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం వి ఆర్ ఆర్ వర్మ , టీడీపీ మండల అధ్యక్షులు జ్యోతుల పెద్దబాబు , లింగంపర్తి సొసైటీ చైర్మెన్ పెంటకోట మోహన్ , పెద్దనాపల్లి గ్రామ ఎంపిటిసి సభ్యులు బుద్ధ ఈశ్వరరావు , ఏ ఎం సి డైరెక్టర్ ఎస్ వి ఎస్ అప్పలరాజు ,గ్రామ యువ నాయకులు సుంకర సత్తిబాబు , మాజీ సర్పంచ్ బుద్ధ సూర్యప్రకాష్, యర్రవరం గ్రామ టీ డీ పి నాయకులు బస్సా మహాలక్ష్మి ప్రసాద్ , మైరాల కనకరావు , జనసేన నాయకులు గంగిరెడ్ల మణికంఠ, ఆకుల నాని , బి జె పి నాయకులు బండారు సూరిబాబు, తిరుమాలి గ్రామ ఆత్మ మెంబర్ మాగపు వీరబాబు , జనసేన కానూరి బ్రహ్మానందం , ఏలేశ్వరం టీడీపీ నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ , కిలారి రామచంద్రరావు, సామంతుల గోపాలకృష్ణ , సామంతుల శ్రీరామచంద్రమూర్తి , నీటి సంఘ అధ్యక్షులు సామంతుల కిషోర్, మామిడి లలిత , సొసైటీ డైరెక్టర్ వైభోగుల సుబ్బారావు , సొసైటీ సీఈవో జ్యోతుల నాగ శ్రీనివాస్, ఆత్మా డైరెక్టర్ వెంకటలక్ష్మి రమణ , పలివెల శ్రీనివాస్ , పలివెల వెంకటేశ్వరరావు , బొట్టు సురేష్ , చల్లా రాజారావు, ముదర కామరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి, అన్ని గ్రామాల రైతు సేవా కేంద్ర సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

# సర్పవరం గ్రామంలో రూ.25 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం





**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఏప్రిల్ 8:**కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు.పోస్టల్ కాలనీ, భావనారాయణపురం ప్రాంతాల్లో నిర్మించిన ఈ అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబు, రంభాల వెంకటేశ్వరరావు, పుల్ల శ్రీరాములు, నూకల నారాయణరావు, నందిపాటి త్రిమూర్తులు, అద్దంకి వీరబాబు, పుల్ల వీరబాబు, మానేపల్లి బాబ్జి, బస్స చంటి బాబు, బస్స సూరిబాబు, కె. శ్రీనివాస్, పాండ్రంకి రాజు, రూరల్ ఎంపీడీఓ పి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండూరు పిహెచ్ సీ జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఏప్రిల్ 08:**కాకినాడ రూరల్ మండల పరిధిలోని పండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పీహెచ్సీ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్యాధికారులు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ వివరాలను మెడికల్ అధికారిణిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు పొందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా మలేరియా అధికారి డా.ఐ. ప్రభాకర్, పండూరు వైద్యాధికారి డా. కె.మాధవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన కార్యక్రమానికి భక్తులు వివరాలు




**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8** ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి ఆలయంలో బుధవారం భక్తి వాతావరణం నెలకొంది. శ్రీకాకుళం జిల్లా మందస మండలం కుంటికోటకు చెందిన కంచరాన రోహన్ కుమార్, ఝాన్సీ దంపతులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా వారు ఆలయంలో జరుగుతున్న అన్నదాన పథకానికి రూ. 10,116-లను విరాళంగా సమర్పించారు. దాతల ఈ సేవను ఆలయ అధికారులు అభినందించి, స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు.

అనంతరం ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దాతలను శేష వస్త్రాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పిల్లల ప్రవర్తన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

## -ప్రగతి ఇంగ్లీష్ మీడియం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో కిర్లంపూడి ఎస్సై,జి. సతీష్.






**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 08:** పిల్లల ప్రవర్తన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కిర్లంపూడి ఎస్సై,జి. సతీష్ అన్నారు. బుధవారం సాయంత్రం కిర్లంపూడి మండలం జగపతినగరం ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఎస్సై, జి సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సందర్బంగా ఎస్సై, జి. సతీష్ మాట్లాడుతూ పిల్లలను ఉద్దేశించి తల్లిదండ్రులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సమావేశంలో వివరించారు. పిల్లల ప్రవర్తన పట్ల ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు గమనించాలని సూచించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ లు ఇవ్వకుండా పిల్లలకు దూరంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులు చదువుపై ఎప్పటికప్పుడు పాఠశాల మేనేజ్మెంట్ ని సంప్రదించాలని సూచించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ను అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రగతి ఏఓ జోగేంద్ర, హెచ్ఎం, జినేష్ బాబు, డీన్ కిరణ్, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శీను బాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలిసిన పర్వత సురేష్.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్ ఏప్రియల్ 08:** ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆశీస్సులతో ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా నియమితులైన పర్వత సూర్యారావు (సురేష్)బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రత్తిపాడు మండలం,పెద శంకర్లపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ను శంఖవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసిన పర్వత సురేష్ ను ఎమ్మెల్యే సత్యప్రభ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజసారు.ఈ సందర్బంగా పర్వత సురేష్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఇంతటి బాధ్యతను నాపై ఉంచిన ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పరామర్శ





కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఏప్రియల్ 08: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పరామర్శించారు.శంఖవరం మండలం, వజ్రకూటం గ్రామానికి చెందిన వార్డు మెంబెర్ గరగ చిట్టిబాబు తండ్రి అచ్చారావు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిజేసారు. అదే గ్రామానికి చెందిన సకురు విష్ణుమూర్తి కుమార్తె కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి సోమయ్య సతీమణి అప్పలరాజు ఇటీవల మరణించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాధపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వట్టికోళ్ల పెదకృష్ణ మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆమె వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

# వృత్తి పరమైన శిక్షణా తరగతులు ప్రారంభం





**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 08;**కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఆలమూరు లోని డాక్టర్ బొబ్బా జయశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్ నందు ఇంటర్ ప్రధమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు పది రోజుల పాటు వృత్తి పరమైన బ్యూటీషన్ అండ్ వెల్నెస్ శిక్షణా తరగతులు ఒకేషనల్ ట్రైనర్ లక్ష్మి పర్యవేక్షణలో బుధవారం ప్రారంభమైనవి. ఈ శిక్షణా తరగతులు జిల్లా ఏపీసీ మమ్మీ, ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ కాళ్ళ మీద తాము నిలబడడానికి వివిధ వొకేషనల్ ట్రైనింగ్ పొందుతున్నారని, బ్యూటీషన్ లాంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ శిక్షణను జొన్నాడ లో గల ఎస్డిఆర్ఎస్ బ్యూటీ పార్లర్ యాజమాన్యం లంకరాజు (జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి),గౌతమి అందించగా దీనిని ఒకేషనల్ కో ఆర్డినేటర్ శ్రీ రమేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓసిడివో ఎం ఏ కే భీమారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు కె ఉమ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఏప్రిల్ 8**

గోదావరి గట్టు కోటిలింగాల రేవులో కొలువైన కోటిలింగేశ్వరస్వామి ఆలయానికి మహిమాన్వితమైన ఆర్చ్‌ను నిర్మిస్తున్నట్టు సిటీ ఎమ్మెల్యే అన్నారు. స్థానిక కోటిలింగాలపేట రోడ్డు వద్ద రూ. 20 లక్షలతో నిర్మించతలపెట్టిన ఆర్చ్ నిర్మాణం పనులకు ఆలయ చైర్మన్ కొయ్యల రమణ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తన హయాంలో కోటిలింగేశ్వర స్వామి ఆలయంకు వెళ్లే ప్రధాన మార్గంలో ఆర్చ్ నిర్మాణానికి అంకురార్పణ జరగడం ఆధ్యాత్మికత మూలాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.దాతల సహకారంతో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ ఆర్చ్ నిర్మాణం రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన ఎండోమెంట్స్ మంత్రి నగరానికి వస్తున్నారని రూ. 7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. రూ. 9 కోట్ల 10 లక్షల నిధులు నియోజకవ ర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు. పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ ఈ ఆర్చ్ నిర్మాణం కోసం 15 సంవత్సరాలుగా ఎదురుచూ స్తున్నామని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో సాకారమైందని తెలిపారు.

దేవస్థానం చైర్మన్ కొయ్యల రమణ మాట్లాడుతూ తమ కమిటీ ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఆర్చ్ నిర్మాణం సంకల్పించామని, దాతల సహకారంతో ఆ సంకల్పాన్ని కార్యరూపం దాల్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక వ్యాపారవేత్తలు, భక్తులు విరాళాలు అందించారు. బిక్కిన రవి రూ. 1,01,118 విరాళం అందించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు గన్ని కృష్ణ, కాశీ నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, , కంటిపూడి శ్రీను, బంగారు నాగేశ్వరరావు, జవ్వాది మురళి, బొర్రా చిన్ని, ఆలయ డైరెక్టర్లు తోట కిరణ్, గుబ్బల గంగాభవానీ, జొన్నా సత్యవేణి, వంగండ త్రివేణి, సంపంగి లక్ష్మీదుర్గ, అలజంగి దేవుడు, జీవీఆర్ రెడ్డి, నిమిష కవి, పిల్లి ప్రసాద్, మద్దుకూరి అనురాధ, తదితరులు పాల్గొన్నారు

# పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8**జిల్లాలో మార్చి--2026లో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం మూల్యాంకన కేంద్రం లో సమీక్షించారు. స్థానిక బాల విజ్ఞాన మందిర్ ఉన్నత పాఠశాల, శ్రీరామ్ నగర్ (లలిత నగర్)లో జరుగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని ఆమె సందర్శించి ఏర్పాట్లు, నిర్వహణ తీరు పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న విధానాలు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, మూల్యాంకనం పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జవాబు పత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి పత్రాన్ని నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేయాలని స్పష్టం చేశారు.జిల్లాలో మొత్తం 1,76,032 జవాబు పత్రాల మూల్యాంకనం చేస్తున్నారని, ఈ ప్రక్రియ కోసం మూల్యాంకనాధికారులు, పర్యవేక్షకులు, రిజర్వ్ సిబ్బంది 755 మందిని నియమించినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు కలెక్టర్ కు వివరించారు. ఈ మూల్యాంకన ప్రక్రియ ఈనెల 6నుండి 15 వరకు కొనసాగనుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా మూల్యాంకనం నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. పాఠశాల విద్యా ప్రాంతీయ

సంయుక్త సంచాలకులు జి. నాగమణి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం. అమల కుమారి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

### ఒప్పుకుంటున్నా.. మా బౌలర్లను బుడ్డోడు వణికించిండు:

## సూర్యవంశీపై ముంబై కోచ్ ప్రశంసలు



**హైదరాబాద్ పెన్ పవర్:** 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ముంబై ఇండియన్స్?పై ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మంగళవారం (ఏప్రిల్ 7) గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచులో ముంబైపై కేవలం 14 బంతుల్లోనే 39 రన్స్ చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ప్రపంచ మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్?లో ఒకే ఓవర్లో రెండు సిక్సులు కొట్టి అందరిని ఔరా అనిపించాడు ఈ ఏళ్ల చిచ్చర పిడుగు. ప్రత్యర్థి జట్టు హెడ్ కోచే స్వయంగా వైభవ్?కు కితాబు ఇచ్చాడంటే అతడి బ్యాటింగ్ ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

ముంబై, రాజస్థాన్ మ్యాచ్ అనంతరం ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ఎదుగుదల చూడటం చాలా ఉత్సాహంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై సూర్యవంశీ చూపిన పట్టుదల అందరి దృష్టిని ఆకర్షించిందని కొనియాడాడు. వైభవ్ తన డేరింగ్ అండ్ డాషింగ్ బ్యాటింగ్?తో ముంబై బౌలర్లు ఇబ్బంది పెట్టాడని జయవర్ధనే ఒప్పుకున్నాడు.

లాస్ట్ ఇయర్ ఐపీఎల్?లోనే అతడి టాలెంట్ ఏంటో ప్రపంచానికి తెలిసిపోయిందన్నాడు. వైభవ్ దగ్గర మంచి స్కిల్ ఉందంటూ అతని ఆత్మవిశ్వాసాన్ని, అగ్రశ్రేణి బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రశంసించారు. యశస్వీ జైశ్వాల్ కూడా ముంబైపై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని అన్నారు. మొదటి మూడు ఓవర్లలో అతను బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతమని.. చాలా చక్కటి షాట్లు ఆడాడని ప్రశంసించారు. ఐపీఎల్ 19వ సీజన్లో రాజస్తాన్ రాయల్స్ హవా కొనసాగుతోంది. మెగా టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్లోనూ రాయల్స్ విజయం అందుకుంది. మంగళవారం వర్షం అంతరాయం కలిగించిన పోరులో యశస్వి జైస్వాల్ (32 బాల్స్లో 40 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్ఆర్ 27 రన్స్ తేడాతో ముంబై ఇండియన్స్ను ఓడించింది. ఆడిన మూడు మ్యాచ్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్కు చేరుకుంది. 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగు వచ్చిన రాజస్తాన్ 150/3 స్కోరు చేసింది.వైభవ్ సూర్యవంశీ (14 బాల్స్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 39) కూడా దంచికొట్టాడు. అనంతరం ఛేజింగ్లో ముంబై 11 ఓవర్లలో 123/9 స్కోరు మాత్రమే చేసి ఓడిపోయింది. షెర్ఫానే రూథర్ఫర్డ్ (8 బాల్స్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25), నమన్ ధీర్ (13 బాల్స్లో 3 ఫోర్లు, 1 సిక్స్ 25) టాప్ స్కోరర్లు. రవి బిష్ణోయ్, సందీప్ శర్మ, బర్గర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. జైస్వాల్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## కోట్ల రూపాలు తీసుకునే ముందే తెల్వదా: ఓవర్సీస్ ప్లేయర్లపై గవాస్కర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఫారెన్ ప్లేయర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఫ్రాంచైజీలు పోటీ పడి మరీ కోట్లు కుమ్మరించి ఓవర్సీస్ ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి. కానీ కోట్ల జీతం తీసుకుంటున్నా విదేశీ ఆటగాళ్లు కొందరు లీగ్?కు అందుబాటులో ఉండటం లేదు. కొందరు వేలంలో పాల్గొని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాక మేం ఆడమని చెబుతున్నారు. ఇంకొందరు లీగ్ స్టార్ట్ అయ్యాక వివిధ కారణాలతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నారు. వీళ్ల తీరుతో జట్టు సమతుల్యం దెబ్బతిని ఆయా ఫ్రాంచైజీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఓవర్సీస్ ప్లేయర్ల తీరుపై భారత మాజీ క్రికెటర్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. తమ హెల్త్ కండిషన్ ఎలా ఉంది..? టోర్నీకి పూర్తిగా అందుబాటులో ఉంటామా లేదా అనే విషయం ఆటగాళ్లకు ముందే తెలియదా అని ప్రశ్నించారు. తమకు చేతకాదని తెలిసినప్పుడు టోర్నీలో ఆడతామని రావడం ఎందుకని నిలదీశారు. టీ20ల్లో ఒక బౌలర్ కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే వేస్తాడని.. ఆ నాలుగు ఓవర్లు వేసేందుకు కూడా శరీరం సహకరించపోతే క్రికెట్ ఆడటం కన్నా రెండు నెలలు రెస్ట్ తీసుకోవడమే మంచిదని చురకలంటించారు. అంతేకానీ కోట్లకు కోట్ల రూపాయలు జీతం తీసుకుంటూ ఫ్రాంచైజీలను ఇబ్బంది పెట్టడం సబబు కాదని అన్నారు. ఒక ఆటగాడికి దేశమే ముఖ్యం ఇందులో ఎలాంటి సందేహం లేదు.. కానీ కోట్ల రూపాయలు తీసుకుంటున్న ఫ్రాంచైజీల పట్ల కూడా నిబద్ధత చూపించాలి కదా అని అన్నారు. షెడ్యూల్ అడ్జస్ట్?మెంట్ కాకపోతే మొత్తం టోర్నీకి దూరంగా ఉంటే ఎవరికీ ప్రాబ్లమ్ ఉండదని.. కానీ ఫ్రాంచైజీలు కొనుగులు చేసిన తర్వాత మధ్యలోనే వదిలి వెళ్లడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కొన్ని దేశాల క్రికెట్ బోర్డులు ఐపీఎల్ ఆడేందుకు ఆటగాళ్లకు ఎన్వోసీ ఇవ్వకపోవడంపై కూడా గవాస్కర్ సీరియస్ అయ్యారు. ప్రతి విదేశీ ఆటగాడి ఐపీఎల్ జీతంలో 10% ఫీజును ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తీసుకుంటాయి. ప్రపంచంలోని మరే ఇతర టీ20 లీగ్‌లోనూ ఇలాంటి నిబంధన లేదు. ఐపీఎల్ కేవలం విదేశీ ఆటగాళ్లకే కాకుండా వారి బోర్డులకు కూడా కాసుల పంట పండిస్తున్నప్పుడు టోర్నీలో ఆడేందుకు ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ , జోష్ హేజిల్‌వుడ్ వంటి ఆటగాళ్లు వివిధ కారణాలతో ఐపీఎల్ 2026లో ఇంకా ఆడలేదు. ఫిట్‌నెస్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేదని శ్రీలంక క్రికెట్ బోర్డు వనిందు హసరంగా, ఈషాన్ మలింగ, మతీష పతిరానా ఎన్వోసీ ఇవ్వలేదు.

## బుమ్రా బౌలింగ్‌లో స్కోరు చేస్తానని చెప్పి చేసి చూపించాడు... అతడ్ని టీమిండియాలోకి తీసుకోవాలి: ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** "గత ఏడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఈసారి అతడి బౌలింగ్‌లో పరుగులు చేయాలి"... ఇది ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పెట్టుకున్న లక్ష్యం. చెప్పడమే కాదు, గతరాత్రి ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో

దూకుడుగా ఆడి దాన్ని చేసి చూపించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసల వర్షం కురిపించాడు.వైభవ్ ప్రదర్శనపై స్పందించిన ఇర్ఫాన్, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. "వైభవ్ ఒక యువ సంచలనం. 15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇంతటి పరిణతితో కూడిన ప్రదర్శన అసాధారణం. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అలాంటిది, అతడిపై పరుగులు చేస్తానని చెప్పి, చేసి చూపించాడు. తన లక్ష్యాన్ని చేరుకున్నాడు" అని ఇర్ఫాన్ కొనియాడాడు."ఈ కుర్రాడిని ఎక్కువ కాలం వేచి చూసేలా చేయొద్దు. ఇప్పుడే జాతీయ జట్టులోకి తీసుకుంటే, అతడు సుమారు 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించగలడు" అని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని నిలకడగా రాణిస్తుండటంతో, ఇర్ఫాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది.

**లుక్ తో అసంతృప్తి**

అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



**మే లో కొత్త షెడ్యూల్**

కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే



జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి**

ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్డ్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్ అవుట్‌పుట్ సాధిస్తే అది భారీ రివార్డ్‌గా మారే అవకాశం ఉంది. కంటెంట్‌పై ఉన్న కాన్ఫిడెన్స్, క్లియర్ విజన్‌తో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్ట్ నిజంగా తారక్ లైఫ్ లో గేమ్ ఛేంజర్ అవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com